# హిందీ నేర్చుకోవడం

తీరికగా కూచుని, సిగరెట్లు పీలుస్తూ వెంకట్రావుని అడిగాను,—హిందీగురించి అతని అభిప్రాయం ఏమిటని.

"నన్నో పెర్సనాలిటీగా పరిగణించి అడుగుతున్నావేమిటి?" అన్నాడతను.

"అలా అడగవలసివచ్చింది. ఈ హిందీపిచ్చి దేశాన్నంతా నక్కేరుబంకలా అంటుకుంది. బ్రహ్మజెముడులా అలుముకుంది; కావాలని కొందరూ, అక్కరలేదని మరికొందరూ, కొందరుకావాలని అంటున్నారు కదాఅని అక్కరలేదనిఅందామని యింకొందరూ. ఎలాఅయితేనేం, ఈ వెర్రి దేశాన్ని గట్టిగా పట్టుకుంది."

"నీకేం, నాకేం! ప్రజాబాహుళ్యానికి ఎప్పుడూ ఒక ఆందోళన కావాలి. ఆందోళనలేకుండా బతకలేదు. ఆందోళన ఆరంభం కాగానే కొందరు యిటూ, మరికొందరు అటూ జేరుతూవుండడం రివాజేకదూ! దీనిలో కొత్త ఏముంది?"

"కొత్త ఏమీలేదుకాని, ఈ విషయం నేను ఆలోచించవలసి వచ్చేవరకూ వచ్చింది."

వెంకట్రావు చిరునవ్వు నవ్వుతూ అన్నాడు. "అంటే?"

"నువ్వనుకున్నట్టే!"

"శాంతాదేవి హిందీ నేర్చుకోవాలంటున్నదా?"

"ఊఁ"

"నేర్చుకోమను."

"అంతటితో ఆ ఉప్పెన ఆగితే సమస్యేలేదు. నేను కూడా అభ్యసించాలట."

"అలాగా!" అన్నాడు వెంకట్రావు, సిగరెట్టుపొగ లోకి చూస్తూ.

మూడు నిముషాలు తీక్షణంగా ఆలోచించాడు వెంకట్రావు. ఒక నిర్ణయానికి వచ్చిన పోకడ అతని మొహంలో స్పష్టంగా కనిపించింది. ఇలాటివిషయాలలో కూడామూడుసంవత్సరాలు గడచినా, నేను ఒక నిర్ణయానికి రాలేకపోదును. ఎంతకీ, లాభనష్టాలూ, మంచి చెడ్డలూ, కష్టసుఖాలూ తూచుకోవడంలోనే పుణ్యకాలం కాస్తా చటుక్కున గడుస్తుంది.

"ఆమెని ఒక ప్రచారక్ వద్ద నేర్చుకోమను. నువ్వామె వద్ద నేర్చుకుంటూ వుండు," అని సలహా యిచ్చాడు వెంకట్రావు.

"రైటో!" అన్నాను.

## 2

ఇంటికి రాగానే దేవిగారు అడిగారు. "ఏమండీ, ఏం చేశారు?"

"హిందీ విషయమేనా!"

"అవును. మల్లమాంబ మధ్యాహ్నం కూడా వచ్చింది. ఇన్నిసార్లు ఆమెని తిప్పించడం సిగ్గేస్తోంది."

"శాంతా, హిందీ నేర్చుకోవడం వల్ల మనకి ప్రత్యేకంగా కలిగే సదుపాయాలు ఏం వున్నాయి?"

కథలో మొదటి ప్రకరణానికి వచ్చాను.

వాదోపవాదాల వల్ల ప్రయోజనం లేదని నాకెప్పుడో తెలుసు. అయినా......

"సదుపాయాలా?" అంది రాణి.

"అవును."

"లక్షోపలక్షలు. దేశమంతా వెర్రిని పడిం దంటారా?"

"దేశమంతా అనుకరించే ప్రతిదీ వెర్రితనమే!"

"మీావన్నీ వింతఅభిప్రాయాలూ, సరిపడని సంగతులూను."

"హిందీ నేర్చుకుంటే నావి సదభిప్రాయాలు అవుతాయి కాదూ!" అన్నాను కొంటెతనంగా.

శాంతా దేవికి ఆగ్రహం రాలేదు. హిందీ విషయమై స్థిరసంకల్పంతో వుంది.

"మనం ఉత్తర హిందూస్థానం వెళ్లవలసి వస్తే, హిందీ నేర్చుకు వుండకపోతే......ఎన్ని యిక్కట్లలో ఎన్ని అగచాట్లో ఆలోచించండి."

"మనకి యింగ్లీషు వచ్చుగా!" అన్నాను నేను.

"వస్తే మాత్రం......దేశభాష కాబోతున్న హిందీ రాక పోవడం ఎంత అవమానమం?"

లెక్చర్లు విన్న ఆవేశం!!!

"ఆహా! ఎంత? ఎంత??" అన్నాను రెండు చేతులూ చూపిస్తూ.

శాంత చీకాకు పడ్డ మాట వాస్తవమే!

"అల్లరి చెయ్యకండి," అని మందలించింది.

"చెయ్యనులే...హిందీ నువ్వు నేర్చుకో. నన్ను

బాధపెట్టకు. నాకు హిందీ వద్దు—మలయాళమూ వద్దు. ఇంగ్లీషు చాలు. ఆ యింగ్లీషుతో నెగ్గుకు రాగలను."

"అలా ఎలా కుదురుతుందండీ, మన దేశంలో పధ్నాలుగు కోట్లమందికి పయిగా హిందీ గాని, దానికి దగ్గిరలో వుండే భాషగాని వచ్చు!"

"అలా ఎందుకు కుదరదండీ, ప్రపంచ జనాభాలో నూటికి పదిమందికి పయిగా యింగ్లీషు వ్రాయడమూ చదవడమూ వచ్చు!"

అంకెల యుద్ధం!!

"అయితే మనకి స్వరాజ్యం వచ్చిన తర్వాత కూడా ఈ యింగ్లీషులోనే రాజకీయ వ్యవహారాలన్నీ జరగాలా?"

"జరిగితేనేం?"

"మీలో దేశాభిమానమూ దేశభక్తీ సన్నగిలి పోవడం వల్ల అలా మాట్లాడుతున్నారు. అప్పుడుకూడా ఈ పాడుభాష అంత ప్రాముఖ్యతలో వుండాలనేనా మీ కోరిక?"

"ఇంగ్లీషుభాష మన్నేంచేసింది, శాంతా? మంచీ చెడ్డా ఆలోచించుకునేందుకు తగిన అవకాశం ఏర్పరిచినది ఆ భాషే!"

"మీతో నేను వాదించలేను. నేను హిందీ నేర్చుకుంటాను. మీరుకూడా నేర్చుకోవాలి."

"నాకీ నిర్బంధం ఏమిటి?"

"నిర్బంధం కాదు. స్వరాజ్య సాధనకి పండిత పామరులందరూ చెయ్యవలసిన కృషి యిదంతా!"

"హిందీ నేర్చుకోవడమా ?"

"అవును."

"శుద్ధఖద్దరు ధరించడంవల్లా, దంపుడుబియ్యం తినడంవల్లా, హిందీ నేర్చుకోవడంవల్లా, బుట్టలు అల్లడంవల్లా స్వరాజ్యం సిద్ధించడం కల్ల."

"దేశోద్ధారకు లందరూ పొరబడరు. వారు మీకంటె సమర్థులు-విషయజ్ఞులు-మేధావంతులు- ఆలోచనాపరులు—రాజకీయధురంధరులు......"

"ఫుల్ స్టాప్, ప్లీజ్. నువ్వు హిందీ నేర్చుకొని దేశాన్ని వుద్ధరించు. నీతో మొండివాదన వెయ్యలేను. నన్ను వదిలెయ్యి."

"వదలను. మీరూ నేర్చుకోవాలి."

"తప్పదూ ?"

"తప్పదు."

"అయితే మధ్యాహ్నం వేళ నువ్వు మల్లమాంబ దగ్గర నేర్చుకుంటూ వుండు. ఏ రోజు నేర్చుకున్నదా రోజు సాయింత్రం నేను ఆఫీసు నుంచి రాగానే నాకు నేర్పుతూ వుండు."

"అలా ఎందుకండీ ?" అని అడిగింది శాంత, నేనేదో మోసగిస్తున్నాననే అపోహతో.

"ఏకానమీ !" అన్నాను.

ముద్దొచ్చే పలువరస కనిపించేటట్లు కమ్మగా నవ్వింది.

"ఇంకో రెండుసినీమాలు చూడవచ్చు," అంది.

"O. K."

## 3

శాంతాదేవి మల్లమాంబ దగ్గిర ట్యూషన్ ప్రారంభించింది.

మొదటివారం అక్షరాలు అభ్యసించడంలో గడిచింది. అక్షరాలు నా కంటె ముందుగానే శాంత నేర్చుకోగలిగింది. నేను వెనకపడడం ప్రారంభించాను. ఆమె ముందుకి లాగడం మొదలెట్టింది.

సంయుక్తాక్షరాలూ, గుణింతాలూ, చిన్న చిన్న పేర్లూ — అంత దాకా నేను వచ్చేటప్పటికి శాంత 'మీరేమి చేయుచున్నారు?'— 'నేను భోజనము చేయుచున్నాను'—లేక — 'నేను చెట్టుకొమ్మ మీద కూచుని వున్నాను'—ఆ పాఠాల దాకా వెళ్ళింది.

నేను మాంద్యమూ, శాంత ప్రోగ్రెస్ చూపిస్తున్నాం. ఉత్సాహంతో నేర్చుకుంటోంది ఆమె, ఎందుకొచ్చిన తద్దినమా అని దిగులు పడుతున్నాను నేను.

పాఠానికి స్వస్తి చెప్పేందుకు ఏ మాత్రం అవకాశం వున్నా పోగొట్టుకునే వాణ్ణి కాను. అవకాశం లభించకపోతే, పఠనాకాలమంతా ప్రశ్నాపరంపరలతో గడిపేవాణ్ణి. భాషలో తగిన ప్రవేశం లేకపోవడం చేత, నా ప్రశ్నలకి సమాధానాలిచ్చేందుకు ఆమె తరుచూ తడుముకోవలసి వచ్చేది.

'కదమ్' అంటే 'పాదము' అనిచెప్పింది.

"గుర్రం కదం తొక్కడ మంటే ఏమిటి? ఇక్కడి 'కదం' నువ్వు చెప్తున్న 'కదమ్' ఒకటేనా?"

"అవవచ్చు. రేపు మేష్టారిని అడిగి, నిశ్చయంగా చెప్తాను," అంది శాంతాదేవి, చిన్నబుచ్చుకున్న ముఖబింబంతో.

ప్రతిరోజూ యిలాంటి దుర్ఘటనలు సంభవిస్తూనే వుండేవి.

అనునాసికములు మమ్మల్నిద్దరినీ మహాబాధ పెట్టేవి. ఉచ్చారణ ఆమెకీ చేతనయేది కాదు; నాకూ చేతనయేది కాదు.

'కాగజ్'కీ 'కాగితా'నికీ అంత దగ్గర సంబంధం ఎలా కుదిరిందనీ, ఆకారాంత పులింగ శబ్దాలు తప్ప యితర పులింగశబ్దాలేవీ బహువచనంలో మార్పు ఎందుకు పొందవనీ, నపుంసకలింగం లేకపోవడానికి కారణం ఏమై వుంటుందనీ... మొదలుగాగల సమాధానాలు లేని ప్రశ్నలు వేసి శాంతని హడలగొట్టేవాణ్ణి. ఆమె నా అడ్డదిడ్డపు ప్రశ్నలకి బెదిరే మనిషి కాదుకాని, పాఠం మాత్రం ముందుకి నడిచేదికాదు. సుమారు రెండునెలలు బాధ పడిన తర్వాత, ఒకరోజు సాయంత్రం చక్కటి సినీమాకి వెళ్లబోతూ శాంత చెవిలో వూదాను.

"శాంతా, శాంతా నువ్వు హిందీలో ప్రాథమిక, మధ్యమ పరీక్షలు పాసైన తర్వాత నాకు చెప్దువుగాని, ఈ లోపున నన్నిలా వుండనీ."

దీనంగా మనవిచేసుకున్న నా కోర్కెని ఆమె ఎంచేతనో తోసిపుచ్చలేక పోయింది. ఇప్పుడు నాకా కారణాలు తెలియక పోయినా, మున్ముందు తెలియగలవనీ

నమ్మకం. కారణం లేకుండా ఏ పనీ చేసే అలవాటు లేదు శాంతకి.

వెంకట్రావుతో సినీమాహాలులో అన్నాను. "బతికి బయట పడ్డానోయ్!"

"నేను చెప్పలేదూ!...అదే మందు. నువ్వు తొందరపడ్డావుగాని, యింకా రెండురోజులు వోపిక పట్టివుంటే నీ ప్రశ్నలవర్షంలో తడిసి ముద్ద అవడం యిష్టంలేక ఆమే రాజీకి వచ్చేది"

"శాంత హిందీ పరీక్షలన్నిటికీ క్రమంగా చదువుతుందంటావా?"

"ఏమో! నాకు నమ్మకం లేదు...ఇదంతా ఆంధ్రుల ఆరంభ శూరత్వం."

రచన : జూన్ 40—ముద్రణ : 'ఆంధ్రవారపత్రిక' 12-3-41

---